RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:57 | ఫిబ్రవరి 05, 2026 | వెల: రూ.3-00



## మేడారంలో ఘనంగా తిరుగువారం

ఐదు లక్షల మంది భక్తులతో కిటకిటలాడిన జాతర

2లో



## తెలంగాణ పాలిటిక్స్ దయనీయంగా మారాయి

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు

2లో

## సీఎం అవినీతి బినామీ బాగోతం బయటపడింది

- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా వెనుక కవర్‌డ్రైవ్ గేమ్
- నోటీసులు డైవర్షన్‌కే...
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

2లో





# బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

### మున్సిపల్ పోరులో పార్టీల హోరాహోరీ
### పట్టణాల్లో వేడెక్కుతున్న రాజకీయం

- గల్లీగల్లీల్లో ప్రచారం ముమ్మరం
- గెలుపు బాధ్యత మంత్రులకు అప్పగించిన హస్తం పార్టీ
- రంగంలోకి దిగిన సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ తరపున కేటీఆర్, హరీశ్ రావు ప్రచారం
- పెరుగుతున్న మాటల వేడి
- ఉత్తర తెలంగాణపై కమలం కన్ను
- అన్ని పార్టీల్లోనూ వెంటాడుతున్న అసంతృప్తుల భయం




2లో

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేడెక్కుతోంది. నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగిసి, అభ్యర్థుల చేతికి పార్టీ బి ఫామ్ లు అందడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార పర్వం హోరెత్తుతోంది. కేవలం ఐదు రోజులే సమయం ఉండటంతో గల్లీ గల్లీలో రాజకీయం సెగలు పుట్టిస్తోంది. అధికార కాంగ్రెస్ తన పట్టు నిలుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, మనుగడ కోసం బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు క్షేత్రస్థాయిలో చెమటోడుస్తున్నారు. మరోవైపు కమలం పార్టీ ఉత్తర తెలంగాణ కార్పొరేషన్లపై కన్నేసింది. అయితే, ఈ ఎన్నికల్లో పార్టీల గెలుపోటములను ప్రత్యర్థుల కంటే సొంత పార్టీలోని రెబల్స్, కోవర్ట్ పాలిటిక్స్ ఎక్కువగా శాసించేలా కనిపిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తి, అంతర్గత కుమ్ములాటలు ప్రధాన పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తుండగా.. అభివృద్ధి మంత్రం, సంక్షేమ హామీల మధ్య పట్టణ ఓటరు ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.



## కుటుంబ కలహం.. ప్రాణం తీసింది

- పొలం వద్ద మహిళా న్యాయవాది హత్య
- కత్తితో దాడి చేసి చంపిన సోదరుడు

2లో

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు ఊరట

- అనర్హత పిటిషన్‌ను కొట్టేసిన స్పీకర్
- పార్టీ మారినట్లు ఆధారాలు లేవని నిర్ణయం

2లో



# పేదల ఆత్మగౌరవం పెంచుతాం

### ఏప్రిల్ బడ్జెట్‌లో లక్షలాది ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

- మిర్యాలగూడ నుంచి ఎన్నికల సమరం ప్రారంభమైంది
- పేదలు, రైతులు, మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణలో అభివృద్ధి పరుగులు పెడుతోంది
- ప్రాజెక్టులు పూర్తి చేసి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుతాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, దామరచర్ల**

ఏప్రిల్‌లో ప్రవేశపెట్టనున్న నూతన బడ్జెట్‌లో లక్షలాది ఇందిరమ్మ ఇండ్లను పేదలకు మంజూరు చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంచే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని గూడూరులో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. అంతకుముందు

మిగతా 2వ పేజీలో..

## మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావుకు సీఎం వార్నింగ్

బెదిరింపులకు దిగితే కఠిన పరిణామాలు తప్పవని హెచ్చరిక



# రూ.15 లక్షలు లంచంతో.. రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడు

- బిల్లుల క్లియరెన్స్ కోసం రూ.40లక్షలు డిమాండ్
- చివరకు రూ.30 లక్షలకు ఒప్పందం
- ఏసీబీకి పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఎస్ఈ

2లో

వేద న్యూస్

గురువారం | ఫిబ్రవరి 05, 2026

# బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్



- ముస్సిపల్ పోరులో పార్టీల హోరాహోరీ
- పట్టణాల్లో వేడెక్కుతున్న రాజకీయం
- గల్లీగల్లీల్లో ప్రచారం ముమ్మరం
- గెలుపు బాధ్యత మంత్రులకు అప్పగించిన హస్తం పార్టీ
- రంగంలోకి దిగిన సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ తరపున కేటీఆర్, హరీశ్ రావు ప్రచారం
- పెరుగుతున్న మాటల వేడి
- ఉత్తర తెలంగాణపై కమలం కన్ను
- అన్ని పార్టీల్లో వెంటాడుతున్న అసంతృప్తుల భయం

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జెండా పాతడమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో, యుద్ధ క్షేత్రంలో నిలిచేది ఎవరో స్పష్టమైంది. అభ్యర్థులందరికీ పార్టీలు బీ ఫామ్ లు అందజేయడంతో అసలు సిసలు ఎన్నికల వేడి మొదలైంది. ప్రచారానికి కేవలం ఐదు రోజులు మాత్రమే సమయం ఉండటంతో, గల్లీ గల్లీలో రాజకీయం వేడెక్కుతోంది.

### రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మకం..

అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ గుర్తుపై జరుగుతున్న మొదటి ప్రధాన స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు బాధ్యతను రేవంత్ రెడ్డి పూర్తిగా మంత్రుల భుజాలపై ఉంచారు. ఒక్కో జిల్లాకు ఒక్కో మంత్రిని ఇన్‌ఛార్జ్‌గా నియమించడమే కాకుండా, వారి సొంత నియోజకవర్గాల్లో ఫలితాల ఆధారంగానే వారి భవిష్యత్తు పనితీరును అంచనా వేస్తామని సీఎం సంకేతాలిచ్చారు. త్వరలోనే ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగనున్నారు. ప్రధాన కార్పొరేషన్ల పరిధిలో భారీ బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొనేలా షెడ్యూల్ ఖరారైంది. ఆరు గ్యారెంటీలు, ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఓట్లు రాబట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది.

### కేటీఆర్, హరీష్ రావు వ్యూహం

అధికారానికి దూరమైన తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ట్రబుల్ షూటర్ హరీష్ రావు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంత ఓటర్లపై కేటీఆర్ పట్టు సాధించేలా ప్రసంగాలు చేస్తుండగా, క్షేత్రస్థాయిలో కేడర్‌ను ఏకం చేసే బాధ్యతను హరీష్ రావు చూసుకుంటున్నారు. పదేళ్లలో నగరాలను ఎలా తీర్చిదిద్దామో చూడండి.. ప్రస్తుత ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైంది.. అనే నినాదంతో గులాబీ దళం ఓటర్ల ముందుకు వెళ్తోంది. పట్టణాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను, హైడ్రా వంటి అంశాలను ప్రధానంగా ఎండగడుతోంది.

### ఉత్తర తెలంగాణపై కమలం కన్ను

లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో రెట్టింపు ఉత్సాహంలో ఉన్న బీజేపీ, ఈసారి కార్పొరేషన్ల పీఠం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను ఎలాగైనా కైవసం చేసుకోవాలని బీజేపీ పావులు కదుపుతోంది. ఈ రెండు నగరాల్లో తమకు గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని భావిస్తున్న కమలనాథులు, ఇక్కడ గెలిస్తే రాష్ట్రవ్యాప్తంగా బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగవచ్చని భావిస్తున్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు, అమృత్ స్కీమ్ ద్వారా నగరాలకు వస్తున్న నిధుల గురించి వివరిస్తూ బీజేపీ ప్రచారం చేస్తోంది.

### హోరెత్తుతున్న గల్లీలు..

ప్రచార పర్వం ఊపందుకోవడంతో నేతల మధ్య విమర్శలు పదునుదేరాయి. బీఆర్ఎస్ నేతలు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని, ఆయన పనితీరును టార్గెట్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు పదేళ్ల బీఆర్ఎస్ అవినీతిని, ధరణి సమస్యలను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. డ్రైనేజీ, మంచినీటి సరఫరా, రోడ్ల దుస్థితి వంటి అంశాలపై అభ్యర్థులను ఓటర్లు నిలదీస్తుండటంతో ప్రచారం రసవత్తరంగా మారుతోంది.

### వెంటాడుతున్న అసంతృప్తుల భయం..

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను రెబల్స్, అసంతృప్త నేతల భయం వెంటాడుతోంది. చివరి నిమిషంలో బీ ఫామ్ దక్కని వారు స్వతంత్రులుగా బరిలో నిలబడటం అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోంది. కొందరు అసంతృప్త నేతలు పార్టీలో ఉంటూనే తమకు నచ్చని అభ్యర్థులను ఓడించేందుకు ప్రత్యర్థి పార్టీలతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ అంతర్గత వెన్నుపోటు ఎవరి సీటుకు ఎసరు పెడుతుందోనని ప్రధాన అభ్యర్థులు టెన్షన్‌లో ఉన్నారు.

## తెలంగాణ రాజకీయాలు దయనీయంగా మారాయి

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నబిన్ సిన్హా
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- కాంగ్రెస్ పాలనపై బీజేపీ నేతల విమర్శలు

**వేద న్యూస్, మహబూబ్‌నగర్**

తెలంగాణలో రాజకీయాలు అత్యంత దయనీయ స్థితికి చేరుకున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను మైనార్టీలకు మళ్లించారని, వక్ఫ్ బోర్డు భూముల అంశాన్ని ప్రస్తావించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని ఆరోపించిన నితిన్ నబిన్ సిన్హా, ఆలయాలపై రాజకీయాన్ని బీజేపీ సహించదని హెచ్చరించారు. మహిళల భద్రతపై కూడా కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా హామీలు అమలు చేయలేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం తప్ప ప్రజలకు మరే లబ్ధి లేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని, అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలను కోరారు.

## సీఎం బినామీ అవినీతి బాగోతం బయటపడింది

- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా వెనుక కవర్‌డ్రైవ్ గేమ్
- నోటీసులు డైవర్షన్‌కే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

బీఆర్ఎస్ నేతలకు వరుసగా నోటీసులు జారీ చేయడం వెనుక డైవర్షన్ గేమ్ ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన భారీ బినామీ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ సీఎం బినామీ కంపెనీగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి ఉపయోగిస్తున్న ల్యాండ్‌క్రూజర్ వాహనం కూడా ఆ సంస్థ పేరుపై రిజిస్టర్ అయిందని తెలిపారు. దాదాపు రూ.2.5 కోట్ల విలువైన వాహనాన్ని ఎందుకు కొనిచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదాయ పన్ను శాఖ విచారణలో కేఎల్ఎస్ఆర్ నుంచి భూపాల్ ఇన్‌ఫ్రా కంపెనీకి నిధులు బదిలీ అయినట్లు తేలిందని పేర్కొన్నారు. దివాళా తీసిన కంపెనీకి సీఎం అయ్యాక వేల కోట్ల ప్రాజెక్టులు ఎలా అప్పగించారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ అవినీతి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు ఊరట

- అనర్హత పిటిషన్‌ను కొట్టేసిన స్పీకర్..
- పార్టీ మారినట్లు ఆధారాలు లేవని నిర్ణయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు ఊరట లభించింది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేశారు. సంజయ్ పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు చేయగా, ఇప్పటికే ఏడుగురిపై తీర్పు వెలువడింది. తాజా నిర్ణయంతో ఇప్పటివరకు ఎనిమిది పిటిషన్లు కొట్టివేయబడ్డాయి. తీర్పుపై స్పందించిన సంజయ్ కుమార్ తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని స్పష్టం చేశారు. తన జీతం నుంచి నెలకు రూ.5 వేల పార్టీకి చెల్లిస్తున్నానని, అఫిడవిట్ కూడా సమర్పించానని తెలిపారు. జగిత్యాల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను కలిశానని చెప్పారు. ఇదిలా ఉండగా, స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షమని, చట్టవిరుద్ధమని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై కోర్టుల్లో తుది తీర్పు తప్పదని ఆయన వ్యాఖ్యానించారు.

# పేదల ఆత్మగౌరవం పెంచుతాం



**మొదటి పేజీ తరువాయి**

రూ.200 కోట్ల వ్యయంతో మిర్యాలగూడ నియోజకవర్గంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఎన్నికల తొలి సమరం మిర్యాలగూడ నుంచే ప్రారంభమైందని అన్నారు. గత రెండేళ్లలో పేదలు, గిరిజనులు, బడుగు–బలహీన వర్గాలు, మహిళలు, యువత కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు గమనించాలని కోరారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 3 కోట్ల 15 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో 50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతు రుణమాఫీ కింద రూ.21 వేల కోట్లను 25 లక్షల 30 వేల మంది రైతులకు అందించామని, రైతు భరోసా కింద ఒకే రోజున రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మరో విడత రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలోనే రైతు సంక్షేమానికి అత్యధికంగా రూ.1.10 లక్షల కోట్లను ఖర్చు చేసిన రాష్ట్రం తెలంగాణేనని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు బస్సుల యాజమాన్యం, జీరో వడ్డీతో రూ.27 వేల కోట్ల రుణాలు అందించామని తెలిపారు. ప్రభుత్వం తొలి విడతలోనే రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, ఏప్రిల్ బడ్జెట్‌లో మరిన్ని ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తిచేస్తామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరు లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావుకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్

**వేద న్యూస్, దామరచర్ల**

### బెదిరింపులకు దిగితే కఠిన పరిణామాలు తప్పవు



మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి బుధవారం స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మిర్యాలగూడలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లు వేసిన కాంగ్రెస్ అభ్యర్థులను ఉపసంహరించుకోవాలని భాస్కర్ రావు బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు ఉన్నాయని అన్నారు. అలాంటి చర్యలు సహించబోమని, బెదిరింపులకు దిగితే కఠిన పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

జానారెడ్డి తన కుమారుడిని కాకుండా నమ్మి భాస్కర్ రావుకు టికెట్ ఇప్పిస్తే, కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తు చేశారు. అయితే అనంతరం ఆయన తన గౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌కు తాకట్టు పెట్టారని విమర్శించారు. అలాంటి వ్యక్తి నాయకుడా కాదా అని ప్రజలు ఆలోచించాలని సీఎం సూచించారు. భాస్కర్ రావు తనకు రాజకీయ అండ ఉందని భావిస్తే అది పొరపాటేనని, సంబంధిత నేతలంతా ముందే తనకు విషయాలు చెప్పారని సీఎం పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకునేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

## రూ.15 లక్షల లంచంతో.. రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడు

- బిల్లుల క్లియరెన్స్ కోసం రూ.40లక్షలు డిమాండ్
- చివరకు రూ.30 లక్షలకు ఒప్పందం
- ఏసీబీకి పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఎస్ఈ

**వేద న్యూస్, కూకట్‌పల్లి**



హైదరాబాద్ నగరంలోని జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లి జోన్‌లో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పనిచేస్తున్న చిన్నారెడ్డి రూ.15 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. చెరువుల శుద్ధి పనులకు సంబంధించిన బిల్లుల క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఓ కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయడంతో ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించారు. రూ.1.40 కోట్ల బిల్లు మంజూరుకు మొదట రూ.40 లక్షలు డిమాండ్ చేయగా, చివరకు రూ.30 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. అందులో భాగంగా బుధవారం జోనల్ కార్యాలయంలో తన వద్ద పనిచేసే ప్రవీణ్ అనే కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా రూ.15 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో ప్రవీణ్‌తో పాటు చిన్నారెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.అనంతరం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోదాలు నిర్వహించిన అధికారులు, చిన్నారెడ్డి కార్యాలయ గదిలోని కీలక ఫైళ్లు, పత్రాలు, కంప్యూటర్లు తదితరాలను పరిశీలించి సంబంధిత ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో జీహెచ్ఎంసీ వర్గాల్లో కలకలం రేగింది.ప్రాథమిక విచారణలో చిన్నారెడ్డి తరచుగా లంచాలు వసూలు చేస్తున్నాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై చిన్నారెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్‌లపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీసీపీ ఆనంద్ కుమార్ తెలిపారు.

## కుటుంబ కలహం.. ప్రాణం తీసింది

**వేద న్యూస్, రంగారెడ్డి**

### పొలం వద్ద మహిళా న్యాయవాది హత్య
### కత్తితో దాడి చేసిన సోదరుడు

రంగారెడ్డి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో పొలం వద్ద మహిళా న్యాయవాది స్వప్న హత్యకు గురయ్యారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె స్వంత సోదరుడే కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న స్వప్నకు కుటుంబంలో ఆస్తి సంబంధిత వివాదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం పొలం వద్ద కుటుంబ సభ్యుల మధ్య పంచాయితీ జరుగుతుండగా మాటా మాటా పెరిగి వాగ్వాదంగా మారింది. ఆ క్రమంలో సోదరుడు కత్తితో ఆమె మెడపై దాడి చేయడంతో స్వప్న అక్కడికక్కడే తీవ్ర గాయాలతో మృతి చెందారు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లాయర్ స్వప్న హత్యను నిరసిస్తూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదులు ధర్నాకు దిగారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## మేడారంలో ఘనంగా తిరుగువారం

**వేద న్యూస్, ములుగు**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వన దేవతల తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర తిరుగువారం సందర్భంగా సుమారు ఐదు లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఐదు వేల మంది కార్మికులతో నిరంతర శుభ్రత పనులు చేపట్టారు. బుధవారం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్‌లతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర పరిసర ప్రాంతాలను పరిశీలించిన మంత్రి, మేడారం గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన జాతర ముగిసినప్పటికీ భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో తాగునీరు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాల్లో లోపం లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. 2026 మేడారం మహా జాతరకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరయ్యారని, మరో వారం రోజులపాటు రద్దీ కొనసాగుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జాతరను శాంతియుతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, డీఎస్పీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్
గురువారం ఫిబ్రవరి 05, 2026

# 35 మంది కార్పోరేటర్లను గెలుచుకోంటాం



**వేదన్యూస్,జ్యోతినగర్ :**

రామగుండం కార్పోరేషన్లో 35 మంది కార్పోరేటర్లను గెలచుకొని మేయర్ పీఠాన్ని అదోరిహిస్తామని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధీమ వ్యక్తం చేశారు.బుధవారం ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలని లోని ప్రవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన విలేకర్ల సమావేశంలో చందర్ పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకుర్ పోటీలో నిలబడిన అభ్యర్థులను బెదిరించి విత్ డ్రాలు చేయుకొనడం ప్రజా స్వామ్యంను కూని చేసినట్టె అని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ వారు గెలుస్తాం అని భోరోసా ఉన్నప్పుడు పోలీసులను ఉపయోగించుకొని భయపెట్టడం రౌడి పాలనకు నిదర్శనమన్నారు.త్వరలో ఈ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేకు ప్రజలె బుద్ది చెప్తారు అని అన్నారు.కార్పోరేషన్ ప్రజలు ఎమ్మెల్యే ఆగాడాలకు అడ్డు కట్ట వేయాలి అంటె బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీ తో గెలుపించాలని కోరారు.బిఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలను గడప గడప తీసుకెళ్ళామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటి మేయర్ అభిషేక్ రావు,గోపు ఐలయ్య యాదవ్,అనిల్ రావు,క్రిష్ణ వేణి ,మారుతీ,బుర్ర శంకర్ గౌడ్ తది తరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీలో విజ్మోని భీమా సేవలు

**వేద న్యూస్, జ్యోతినగర్:**

రామగుండం కార్పోరేషన్ పారిశ్రామిక ప్రాంతంలో 322 వ బ్రాంచ్ ని ఆ సంస్థ కు చెందిన తెలంగాణ జోనల్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి ఎన్టీపీసీ క్రిష్ణ నగర్ లో బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో అంతర్జాతీయ డిజిటల్ పేమెంట్స్ వంటి సేవలు ఈ ప్రాంతంలో అందించడం కోసం బ్రాంచ్ ని ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్థిక రంగంలో విశ్వసనీయ మార్గదర్శకుడిగా ఉంటు బంగారు రుణాలు, విదేశీ మారకం, విదేశాలకు డబ్బు పంపడం, బహుళ కరెన్సీ ట్రావెల్ కార్డులు, ప్రయాణం , టూర్స్, డిజిటల్ చెల్లింపులు , వాలెట్ సొల్యూషన్స్ మరియు బీమా వంటి విస్తృత శ్రేణి సేవలను అందిస్తున్నట్లు తెలిపారు . సిఎస్ ఆర్ విధానంలో భాగంగా, అధికారులు గోదావరిఖని లోని సప్తగిరి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఆర్ వో నీటి శుద్ధీకరణ యంత్రాన్ని పంపిణీ చేశారు.మరిన్ని వివరాలకు www.unimoni.in ని సందర్శించండి లేదా 1800 102 0555 ను సంప్రదించండి లేదా customercare@ unimoniindia.com కు




ఇమెయిల్ లో సంప్రదించవచ్చని కోరారు.కంపెనీ సేవలను మరిన్ని ప్రాంతలలో అందించేందుకు కృషి చేస్తుమన్నారు.ప్రతి ఒక్కరు విజ్మోని సేవలను వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో విజ్మోని ఉద్యోగులు ,కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలోనే కులగణన చేయాలి



**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**

- బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్న మోడీ ప్రభుత్వం
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బీసీ ప్రధానమంత్రి అని చెప్పుకుంటూ, వాస్తవంగా బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తీవ్రంగా విమర్శించారు. బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పసుల చంటి మాట్లాడుతూ.. 2025 ఏప్రిల్ 30న కేంద్ర కేబినెట్ జనగణనలోనే కులగణన నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, జనవరి 22న కేవలం జనగణనకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కులగణన నిర్వహించి, దేశానికే రోల్ మోడల్‌గా నిలిచామని తెలిపారు. కులాల వారీగా వాటాలను నిర్ధారించి, రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కేవలం ఎస్సీ, ఎస్టీలకే పరిమితం అవుతుందని, అన్ని కులాలు, ఉపకులాల వారీగా లెక్కిస్తేనే బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ ఫలాలు, ప్రత్యేక రాయితీలు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. 'మేమెంతో-మాకంతా..' నినాదాన్ని తుంగలో తొక్కి, దొడ్డి దారిలో బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని బీసీ సంఘాలు బీజేపీ ఎంపీలపై ఒత్తిడి పెంచి, పార్లమెంటులో ఈ అంశంపై చర్చ జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందూర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, నక్కలవాడ గ్రామ సర్పంచ్ అడప నవీన్ కుమార్, దన్నూర్ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి, కుచలాపూర్ ఉపసర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు మెరుగు భోజన్న, పన్నాల చమేందర్ రెడ్డి, కోలా ప్రశాంత్, తరుణ్, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉమేష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

**వేద న్యూస్, కాజీపేట:**



కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ వెంకన్న ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మందిని పోలీసులు పట్టుకున్నారు. వీరిలో శివరాత్రి దేవయ్య అనే వ్యక్తి ఇప్పటికే 10 సార్లు మద్యం సేవించి వాహ నం నడుపుతూ పట్టుబడ్డాడని, తాజాగా 11వ సారి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 105 ఆల్కహాల్ రీడింగ్‌కు మించి మద్యం సేవించి పట్టుబడ్డాడని ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు. సదరు వ్యక్తిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. ఫాతిమా చిన్నప్ప ముం దు హాజరుపరచగా, ఆయనకు 30 రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకన్న వెల్లడించారు.

# రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి



**వేద న్యూస్, నల్లబెల్లి:**

ప్రతి పాఠశాలలో రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా ప్యానెల్ తనిఖీ బృందం నోడల్ అధికారి గుండు రవి అన్నారు. బుధవారం నల్లబెల్లి మండలం బోలోని పెల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ గుండు రవి మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల పనితీరుపై ప్యానల్ ఇన్స్పెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేయడం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఉదయం ప్రార్థన సమావేశం మొదలుకొని పరి సరాల పరిశుభ్రత, టాయిలెట్ ల నిర్వహణ, ఆటలు, లైబ్రరీ నిర్వహణ, ఉపాధ్యాయుల డైరీ, లెస్సన్ ప్లాన్స్, ఎఫ్.ఎల్. ఎన్, లిప్ రిజిస్టర్ లు, మధ్యాహ్న భోజన కార్యక్రమం, ఉపా ధ్యాయుల హాజరు లాంటి అంశాలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తున్నన్నామని అన్నారు. ప్యానల్ ఇన్స్పెక్షన్ బృందం ఈరోజు బొల్లోని పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన తనిఖీల్లో భాగంగా అన్ని అంశాలను పరిశీలించి, అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమికోన్నత స్థాయి పరిశీలన బృందం సభ్యులు కట్కూరి నరసింహులు, మెరుగు రఘుపతి, బోల్లోనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శారద, పాఠశాలఉపాధ్యాయులు ఏ.శేఖర్, ఎమ్.అనూష, కె. అనిత,జె.మంజుల, సిఆర్‌పి ఎస్. లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు.

# సమ్మెను జయప్రదం చేయండి

**– 12 ఫిబ్రవరి 2026 దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె**

**వేద న్యూస్, హనుమకొండ :**

ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా సిపిఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం గౌడ్ సమ్మె నోటీసును డి ఎం అండ్ హెచ్ ఓ కు డాక్టర్ అల్లం అప్పయ్య కు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి హను మకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని సదానందం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ కేంద్ర , కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలని, విబిజి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ నూతన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, 106 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చిందన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు విద్య మరియు వైద్యం నేడు ముప్పు వాటిల్లిందని కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడులను అమలుకు తెస్తున్నారు 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారు. సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తున్నది కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ ను కట్టినంతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం బరితెగించింది భారత రాజ్యాంగం కల్పించిన హక్కులన్నిటిని తుంగలోకి తొక్కి ఉద్యోగులను గుర్తించకుండా వెట్టి చాకిరి చేసే విధంగా ప్రయత్నం సాగితుందన్నారు. 4 లేబర్ కోడులను తిప్పి కొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మిక వర్గానికి చాలా అవసరం ఉందని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జాతీ య ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ,ఈ.ఎస్.ఐ., పీ.ఎఫ్. ప్రతినెల ఉద్యోగుల ఖాతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల వేతనాలు అక్టోబర్ నవంబర్ డిసెంబర్ మరియు జనవరి వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో నిరవేదిక సమ్మె కూడా వెనుకాడమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఫిబ్రవరి 11వ తేదీలోపు 4 నెలల వేతనాలు ఉద్యోగుల ఖాతాలో జమ చేయకుంటే ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఎన్ హెచ్ ఎం హనుమకొండ



జిల్లా ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొం టారని తెలియజేస్తున్నాము. కావున ఉద్యో గులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి, 2026 ఫిబ్రవరి 12 వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఉదయం 10 గంటల కు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో నిరసన కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ందరికీ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

**వేద న్యూస్, బట్టుపల్లి:**



హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టుపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ఉదయం కల్లుగీత కోసం తాటి చెట్టు ఎక్కిన పూజారి రవి ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడికి కాళ్లు, తొడలు, చేతుల భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే రవిని హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# 'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

**– బహుజన సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు**

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం శాయం పేట మండల అధ్యక్షులు మారపల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలలో ప్రారంభమైన ఉపాధి హామీ పనులు మే నెలాఖరు వరకు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కావున జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఆయన కోరారు.

# ఉత్కృష్ట పతకాన్ని అందుకున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్



**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

పోలీస్ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం బెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ కు ప్రకటించిన ఉత్కృష్ట పతకాన్ని, బుధవారం సీపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా డిసిపి రాజమహేంద్ర నాయక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డీసీపీకి అభినందనలు తెలియజేయడంతో పాటు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే అధికారులకు శాఖా పరమైన గుర్తింపుతో పాటు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కూడా లభిస్తుందని సిపి తెలియజేశారు. 2010 డీఎస్పీగా పోలీస్ శాఖలో చేరిన రాజమండ్రి నాయక్ నెల్లూరు జిల్లాతో, వరంగల్ సిసిఎస్, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో డి.ఎస్పీగా పని చేసి 2017 అదనపు ఎస్పీగా భూపాలపల్లి, ఇంటెలిజెన్స్ పనిచేసి, 2021లో ఎస్పీ పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసారు ప్రస్తుతం సెంట్రల్ జోన్ డీసీపీ ఎంతో సమర్ధవంతంగా పనిచేయడంమే కాకుండా తను పని చేసిన సమయంలో ఎన్నో కీలక కేసులను పరిష్కరించడం డీసీపీ రాజ మహేంద్ర నాయక్ కీలకంగా నిలిచారు. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది డీసీపీ అభినందనలు తెలిపారు.

వేద న్యూస్
గురువారం ఫిబ్రవరి 05, 2026

# కాంగ్రెస్ మండల కన్వీనర్‌గా రెండోసారి పాండురంగ్

**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో జల్కె పాండురంగ్ పేరును ప్రతిపాదించగా, హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గతంలో మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తించి మరోసారి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ జల్కె పాండురంగ్ మాట్లాడుతూ, తనపై మరోసారి నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని చెప్పారు. కార్యకర్తలందరినీ కలుపుకొని మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, జల్కె పాండురంగ్ నాయకత్వంలో పార్టీకి మండలంలో మంచి ప్రజాదరణ లభించిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల,



గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- 12 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్
- రూ. 2 లక్షల 6 వేల నగదు, 12 సెల్ ఫోన్లు స్వాధీనం

**వేద న్యూస్, కాజీపేట:**



కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో టాస్క్‌ఫోర్స్ సీఐ బాబూలాల్ ఆధ్వర్యంలో బుధవారం పేకాట శిబిరంపై దాడి నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 2 లక్షల 6 వేల నగదు, 12 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని కాజీపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ పోలీసులు హెచ్చరించారు.

# అంగన్వాడీలో బాలమృతం, ఎగ్స్ పంపిణీ

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో అంగన్వాడీ సెంటర్-1 ఆధ్వర్యంలో బాలమృతం, ఎగ్స్ పంపిణీ కార్య క్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎనుగుల కనక య్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ, వార్డ్ మెంబర్ దమ్మ వెంకటరమణ, గ్రామ కార్యదర్శి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. అలాగే అంగన్వాడీ సెంటర్ -1 టీచర్ శైలజ, ఆయమ్మలు, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎనుగుల కనకయ్య మాట్లాడుతూ.. బాలల ఆరోగ్యా భివృద్ధిలో బాలమృతం, ఎగ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి తల్లి పిల్లలకు బాలమృతాన్ని క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ చిన్నారుల పోషణపై అవగాహన కలిగించే సందేశాన్ని అందించారు. వార్డ్ మెంబర్ దమ్మ వెంకటరమణ కూడా పిల్లల ఆరోగ్య సంరక్షణపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు బహుమతులను సర్పంచ్ ఎనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ శైలజ, వార్డ్ మెంబర్ వెంకటరమణ చేతుల మీదుగా గ్రామ కార్యదర్శి సమక్షంలో పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఆహ్వానించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అంగన్వాడీ సెంటర్1 టీచర్ శైలజను గ్రామస్తులు అభినందించారు.

# పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- ఎలాంటి పొరపాట్లు జరగొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**వేద న్యూస్, మంచిర్యాల:**



మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా 11వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ.లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ప్రక్రియలోని ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యతను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇతరుల బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం పాటించాల్సిన నియమాలపై కూడా శిక్షణలో వివరించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు మినహాయింపు కోరితే ఆమోదం ఉంటుందని, మిగతా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు లేదా ఇతర తీవ్రమైన ఇబ్బందులు ఉన్నప్పుడే మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. 11వ తేదీన పోలింగ్, అవసరమైతే 12వ తేదీన రీపోలింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొదురుపాకకు నీటి సౌకర్యం కల్పించిన బండి సంజయ్ కుమార్

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కొదురుపాక గ్రామం రోడ్ నెంబర్-8 ప్రాంతంలో తీవ్ర నీటి కొరత ఉందని గ్రామస్తులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే తన ఎంపీ నిధుల నుంచి బోరు వేయించడంతో పాటు బోరు మోటార్‌ను కూడా మంజూరు చేశారు. గ్రామస్తుల అవసరాన్ని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బోరు మోటార్‌ను బిగించడం పూర్తయ్యింది. బోరు వేయించి మోటార్ అందించినందుకు కొదురుపాక గ్రామ ప్రజల తరపున, భారతీయ జనతా పార్టీ తరపున బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొదురుపాక గ్రామ సర్పంచ్ మంజుల సుధాకర్, ఉపసర్పంచ్ బాలగోని గోపాల్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్ల పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బి. సుధాకర్ గౌడ్ బుధవారం గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం సమక్షంలో పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ.. గతంలో కూడా తాను అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవాభావం కొనసాగించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీవిద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ

- రాష్ట్రంలోనే తొలి జిల్లాగా హనుమకొండ




**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండ జిల్లాలో బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈ తరహా శిక్షణను హనుమకొండ జిల్లాలోని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించడం విశేషం. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 244 మంది బూత్ లెవల్ ఏజెంట్లు, 26 మంది డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. తాజా ఓటర్ లిస్ట్ ఆధారంగా బీఎల్ఓలతో కలిసి ఇంటింటి పరిశీలన చేపట్టి, వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లను గుర్తించాలని సూచించారు. ఇది రానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు ముందస్తు సిద్ధతగా కీలకమని అధికారులు తెలిపారు. ఓటర్ జాబితా శుద్ధితో ఎన్నికల పారదర్శకత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణను ఎన్నికల సూపరింటెండెంట్ జగత్ సింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమకొండ, కాజీపేట తహసీల్దారులు జి. రవీందర్ రెడ్డి, రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# మహిళా పోలీసులకు ప్రత్యేక విశ్రాంతి గది ప్రారంభం

- జిల్లాలో మహిళల భద్రతకు మొదటి ప్రాధాన్యత
- ఎస్పీ అఖిల్ మహాజన్



**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**

జిల్లాలో మహిళల భద్రత, రక్షణకు పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసరాలు, విశ్రాంతి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నూతన గదిని వేద మంత్రోచరణల నడుమ మహిళా కానిస్టేబుల్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయించి ప్రారంభించారు. అలాగే పురుష సిబ్బంది విశ్రాంతి కోసం మరో గదిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, ఇచ్చోడ సీఐ బండారి రాజుతో కలిసి ప్రారంభించారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం షీ టీమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని, షీ టీమ్ ఆధ్వర్యంలో 'పోలీస్ అక్క' కార్యక్రమం ద్వారా మహిళలు, చిన్నారులకు మరింత చేరువయ్యామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ, రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని, పెండెన్సీ లేకుండా బాధితుల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాల సంఘం ఆధ్వర్యంలో సన్మానం

**వేద న్యూస్, మంచిర్యాల జిల్లా:**



ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో చింతగూడ గ్రామం 2వ వార్డులో భారీ మెజారిటీతో విజయం సాధించి, వార్డు మెంబర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన మేకల అక్షయ్ కుమార్‌ను బుధవారం జన్నారం మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో మండల మాల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాల కులానికి చెందిన అక్షయ్ కుమార్ భవిష్యత్తులో రాజకీయ రంగంలో మరింతగా రాణించి, ఉన్నత పదవులు అధిరోహిస్తూ మాల కుల బాంధవులకు, ప్రజలకు విస్తృత సేవలు అందించాలని రాష్ట్ర, జిల్లా, మండల మాల సంఘం నాయకులు ఆకాంక్షించారు. ఆయనకు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు అందించారు.

వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 05, 2026

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి
- అనుమానాస్పద కదలికలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- పోలీస్ అధికారులకు సూచన

**వేద న్యూస్, మెదక్:**

మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రామాయంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి, గొల్లిపర్తి, రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ విస్తృతంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా ఈ పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్ఐ బాలరాజ్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ రోజున ఓటర్లు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రలోభాలు,



గుంపులుగా చేరడం, అనుమానాస్పద కదలికలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి, లెక్కింపు సమయంలో పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. రామాయంపేట్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్‌ను కూడా తనిఖీ చేసి, రూ.50,000/- కంటే ఎక్కువ నగదు తరలిస్తే సరైన ఆధారాలు తప్పనిసరిగా చూపించాలని, లేకపోతే నగదు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్ఐ బాలరాజ్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీకి దేహ దానం

**వేద న్యూస్, వరంగల్:**



హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణం ప్రశాంత్ నగర్‌లోని సహృదయ వృద్ధ నివాసి అనంత లక్ష్మి (72) మృతి చెందారు. ఆమె మరణానంతరం ఆశ్రమ నిర్వహకులు యాకుబీ చోటేమియా సమాజ హితం కోరి, వైద్య విద్యా నిమిత్తం మెడికల్ కాలేజీకి దేహదానం చేయడానికి అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ ద్వారా దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీ అనాటమీ విభాగానికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ శశికాంత, అనాటమీ సిబ్బంది ప్రేమ్ కుమార్, ప్రణయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ శశికాంత మాట్లాడుతూ.. నిశబ్ద గురువు అయిన పార్థీవదేహ దానంతో భవిష్యత్ వైద్యులు శస్త్రచికిత్సలు, శాస్త్రీయ పరిశోధనలు, వైద్య విద్యను నేర్చుకుంటారన్నారు. దేహదానం చేసిన నిర్వహకులకు, అసోసియేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పద్మ, హనుమకొండ అధ్యక్షులు పరికి పండ్ల వేణు, ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేష్ విడుదలకు కృషి

- సౌదీ జైలులో అక్రమ కేసు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ లేఖను ఎస్పీకి అందజేత

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలానికి చెందిన కంఠం వెంకటేష్ సౌదీ అరేబియా జైలులో అక్రమ కేసులో నిర్బంధంలో ఉండటంపై ఆయనను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఇచ్చిన లేఖను ఎస్పీకి అందజేశారు. వెంకటేష్‌ను మోసం చేసి సౌదీ అరేబియాకు పంపిన నకిలీ ఏజెంట్ తునికి శేఖర్‌తో పాటు అతనికి సహకరించిన వారందరిపై కఠిన చట్టపర చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తడగొండ సత్యరాజ్ వర్మ, కరీంనగర్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు తడగొండ నర్సింగ్ బాబు, బూరుగుపల్లి బీజేపీ నాయకులు పెంచాల మహేష్, సూదుల సాయి, రామంచ సురేష్, కంఠం కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాదర్బార్‌లో, అలాగే రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ

**వేద న్యూస్, టేక్మాల్:**

ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కే. నర్సమ్మ పిలుపునిచ్చారు. బుధవారం టేక్మాల్ మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపిడీఓ కార్యాలయంలో హరిచంద్‌కు, మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాధికారి సుజాతకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి, 4 లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ చట్టాల వల్ల కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులు దెబ్బతింటున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యజమానులకు అనుకూలంగా విధానాలు తీసుకొస్తూ కార్మికులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్మికులకు గత 3-4 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. 2వ పీఆర్‌సీ అమలు, జీఓ నంబర్ 51 రద్దు, ఆన్‌లైన్‌లో నమోదు



కాని కార్మికుల పేర్లు నమోదు చేయడం, అందరికీ ఇందిరమ్మ ఇళ్లు, యూనిఫాం, సబ్బులు, నూనెలు, బెల్లం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం రూ.26వేలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసమే ఫిబ్రవరి 12న సమ్మె నిర్వహిస్తున్నామని, మండలంలోని కార్మికులంతా తప్పకుండా పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సదానందం, సాయిలు, నాయక్, పూల్లెందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల తనిఖీ చేసిన సర్పంచ్



- విద్యార్థులతో ముఖాముఖి
- మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన

**వేద న్యూస్, కారేపల్లి:**

మండల కేంద్రంలోని విశ్వనాథపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని స్థానిక జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలను బుధవారం సర్పంచ్ ఇస్లావత్ రాజు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల పనితీరు, విద్యాబోధనను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రమాణాలపై ప్రశ్నలు అడిగి అభినందించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. అనంతరం తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో సమావేశమై వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన పూర్తి సహకారం గ్రామపంచాయతీ తరపున అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఆలయ భూమి కేసులో కోర్టుకు హాజరు



- మడికొండ మహంకాళి దేవాలయ భూమి పరిరక్షణలో కీలక అడుగు

**వేద న్యూస్, మడికొండ:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, మడికొండలో ఉన్న మహంకాళి అమ్మవారి దేవాలయ స్థలం ఆక్రమణకు సంబంధించిన కేసులో భాగంగా ఆలయ భూమిని పరిరక్షించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, రాష్ట్రీయ హిందూ పరిషత్ సభ్యులు బుధవారం హనుమకొండ పీడీఎం కోర్టుకు హాజరయ్యారు. మహంకాళి అమ్మవారి దేవాలయ స్థలాన్ని ఆక్రమించేందుకు జీడబ్ల్యూఎంసీ నుంచి అక్రమంగా ఇంటి నెంబర్ పొందిన అంశంపై గతంలో దేవాలయ కమిటీ, రాష్ట్రీయ హిందూ పరిషత్ సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆ ఇంటి నెంబర్‌ను అధికారులు రద్దు చేశారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని హెచ్చరించడంతో, ఆక్రమణదారులు స్వయంగా నిర్మాణాన్ని తొలగించారు. ఈ చర్యపై ఆక్రమణదారులు సివిల్ కోర్టులో కేసు దాఖలు చేయగా, బుధవారం జరిగిన విచారణకు రాష్ట్రీయ హిందూ పరిషత్ సభ్యులు హాజరై దేవాలయ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కేసు తదుపరి విచారణను కోర్టు ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.కోర్టుకు హాజరైన వారిలో రాష్ట్రీయ హిందూ పరిషత్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్, రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కొడారి రాజు, దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చీకటి రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షులు పల్లపు అశోక్ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి చేసింది మేమే.. గెలిచేది మేమే

- బీఆర్ఎస్ హయాంలోనే పట్టణాల్లో వెలుగులు
- రెండేళ్లలో కాంగ్రెస్ చేసింది శూన్యం
- మాజీ ఎమ్మెల్యే శంకర్ రవిశంకర్ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్

**వేద న్యూస్, చొప్పదండి:**

మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న చొప్పదండిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేసిన ఘనత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వానిదేనని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో చొప్పదండి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే శంకర్ రవిశంకర్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. చొప్పదండి పట్టణంలోని రెండో వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి మాదూరి సరోజనకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కోట్లాది నిధులు వెచ్చించి పట్టణాభివృద్ధి చేసినట్టు గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా, బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి పనులను పూర్తిచేయలేకపోతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో చొప్పదండి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.



అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ వార్డుల ఇన్‌చార్జ్‌లకు అవగాహన సమావేశం నిర్వహించి, బీఫామ్ పొందిన అభ్యర్థుల గెలుపుకోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు బత్తిని సంపత్, మాజీ మార్కెట్ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండి అజ్జు, ఎండి జహీర్, నాయకులు పోరండ్ల నితీష్, పెద్దెల్లి అనిల్, నరేష్ రావణ్, బీసవేణి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా తిరుపతి నియామకం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



మల్లాపూర్ మండలంలోని కేఆర్ఎం గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముత్యంపేట గ్రామానికి చెందిన రేవెళ్ళి తిరుపతిని లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నియమించారు. అలాగే సెక్రటరీగా రత్నపూర్‌కు చెందిన పుంద్ర శశికాంత్‌ను, ట్రెజరర్‌గా సిరిపూర్‌కు చెందిన మిల్క నవీన్‌ను నియమించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ గవర్నర్ సింహరాజు, కోదండరాం, మొర బద్రేశం, గుంటుక చంద్ర ప్రకాష్, వెలుముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమి పూజ

వేద న్యూస్, చొప్పదండి/రామడుగు:



ఇంటి ఆవరణలో ఒక్క ఇంకుడు గుంతను తవ్వుకుంటే, పరోక్షంగా ఆ కుటుంబానికి అవసరమైన నీటి అవసరాలు తీరుతాయని పలువురు పేర్కొన్నారు. భూగర్భ జలాల పెంపుకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు. బుధవారం చొప్పదండి మండలంలోని షానగర్ గ్రామంలో ఆంజనేయ స్వామి శివాలయం వద్ద ఇంకుడు గుంతల తవ్వకానికి సర్పంచ్ గునుకొండ శైలజ, ఏపీఓ రాధ కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిరుత అంజయ్య, దేవాలయ ఛైర్మన్ ఎడ్ల మోహన్, పంచాయితీ కార్యదర్శి మదు, మాజీ సర్పంచ్ గునుకొండ అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

- ఎలాంటి పొరపాట్లు జరగొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**వేద న్యూస్, మంచిర్యాల:**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రక్రియలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ కోసం ఎంపిక చేసిన శారద ప్రింటింగ్ ప్రెస్‌ను కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించి ముద్రణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యిందని, అర్హత గల అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించినట్లు తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో 240 మంది, బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులలో 173 మంది, చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులలో 107 మంది, క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులలో 113 మంది, లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులలో 60 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని వివరించారు. జిల్లాలోని ఒక మున్సిపల్ కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం 693 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న పోలింగ్, అవసరమైతే 12న రీపోలింగ్, 13న ఓట్ల లెక్కింపు నిర్వహించి గెలుపొందిన అభ్యర్థుల ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విలాసాగర్ విద్యార్థులు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శివరామకృష్ణ, మహాలక్ష్మి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1న నగునూర్‌లో నిర్వహించిన 16 సంవత్సరాల లోపు బాలబాలికల జిల్లా స్థాయి వాలీబాల్ సెలక్షన్లలో ప్రతిభ కనబరిచి వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీటీ ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 5 నుంచి 8 వరకు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోలగం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

# కట్నం వేధింపులు.. వివాహిత ఆత్మహత్య

- భర్తపై కేసు నమోదు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో కట్నం వేధింపుల కారణంగా ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. బోయినిపల్లి గ్రామానికి చెందిన దొంతరవేణి నర్మద (28)కు ఐదేళ్ల క్రితం జగ్గరావుపల్లి గ్రామానికి చెందిన దొంతరవేణి నరేష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వివాహానంతరం ఏడాది నుంచి అదనపు కట్నంగా రూ.2 లక్షలు తీసుకురావాలని నరేష్ భార్యను మానసికంగా, శారీరకంగా వేధించాడని ఆరోపణలు ఉన్నాయి. పెద్దమనుషుల సమక్షంలో జరిగిన పంచాయతీలో భార్యా పిల్లలను బాగా చూసుకుంటానని నరేష్ ఒప్పుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం ఉపాధి నిమిత్తం నరేష్ విదేశాలకు వెళ్లగా, అక్కడి నుంచీ ఫోన్ ద్వారా డబ్బులు పంపాలని భార్య నర్మదను వేధింపులకు గురిచేశాడని సమాచారం. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన నర్మద తన తల్లిదండ్రుల ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తండ్రి ఉరుమడ్ల రాజయ్య ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు నర్మద భర్త దొంతరవేణి నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బోయినిపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.



# ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ

- విద్యార్థులతో మాటామంతీ
- పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి ఆదేశాలు

**వేద న్యూస్, కారేపల్లి:**

గిరిజన విద్యార్థుల సంక్షేమం, విద్యా వికాసమే లక్ష్యంగా భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. రాహుల్ బుధవారం కారేపల్లి మండల కేంద్రంలోని శాంతినగర్ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, డార్మిటరీలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, వంటశాలలను పరిశీలించి సిబ్బందికి కీలక సూచనలు చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడిన పీఓ.. గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో వారి ప్రతిభను పరీక్షించి అభినందించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వంటశాల పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాల్లో లోపాలు లేకుం డా చూడాలని స్పష్టం చేశారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఈ ఏడాది ఫలితాల్లో శాంతినగర్ పాఠశాల జిల్లాలో ఉత్తమంగా నిలవాలని ఉపాధ్యాయులకు సూచించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో ఐటీడీఏ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# అంగన్వాడీ, మహిళా సంఘ భవనాలకు భూమి పూజ

- భూమికి ఆర్థిక సహాయం చేసిన మిర్యాల సోదరులు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, మహిళా సంఘ భవనాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ భవనాల కోసం స్థలాల కొరత ఉండటంతో, భూమి కొనుగోలు నిమిత్తం ఆమనగల్లు గ్రామానికి చెందిన మిర్యాల రామ్మూర్తి, సుధాకర్, వెంకటేశ్వర్లు సోదరులు రూ.2 లక్షల 40 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లల సందీప్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల కోసం భూమి అవసరమని కోరగానే స్పందించి సహాయం చేసిన మిర్యాల సోదరుల దాతృత్వం అభినందనీయమని అన్నారు. గ్రామ అభివృద్ధికి వారి సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. అనంతరం దాతలను సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శాలెం రాజు, వివిధ సంఘాల నాయకులు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి తహసీల్దార్ వరప్రసాద్ బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోట రమేష్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గణేష్, ఏపీఓ కొమురయ్య, ఏపీయం శంకర్, సీసీ రాజేందర్, ఏఈ అభినయ్, కార్యదర్శి రాజశేఖర్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వెంగల బాపు

**వేద న్యూస్, జ్యోతినగర్ :**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో ఫిబ్రవరి 11న జరగబోయే ఎన్నికల్లో భాగంగా బుధవారం రెండో డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి వెంగళ బాపు ప్రచారంలో తనదైన శైలిలో దూసుకెళ్తున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్ లో నన్ను గెలిపిస్తే రామగుండం ఎమ్మెల్యే సహకారంతో డివిజన్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని అన్నారు. కావున రాబోయే ఎలక్షన్లో డివిజన్లను ప్రజలందరూ భారీ మెజార్టీతో గెలుపొందించాలని ఆయన ప్రజలను ఈ ప్రచారంలో కోరారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, వినియోగదారుల సమన్వయ మండలి దక్షిణ భారత చైర్మన్ పల్లెపాడు దామోదర్ తెలిపారు. దామెర మండలం ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోటీల విజేతలకు పల్లెపాడు దామోదర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరికల్లాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని, వారి నైపుణ్యాలను గుర్తించి అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల అభిరుచులను గుర్తించి అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఒక్కో విజేతకు రూ.1,000 విలువైన బహుమతులు అందజేశామని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. సత్యనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ద్వారా లభించే ప్రయోజనాలు, పథకాలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరింతగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సమన్వయకులు రవీందర్, ఉపాధ్యాయులు డా. ఆర్. గణపతి, విజయప్రభ, అనిత కుమారి, డా. వంగల జగన్, స్వరూప రాణి, వంగేటి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.




# అడవి పందుల వల్ల పంట నష్టం

- 10 మంది రైతులకు నష్టపరిహారం చెల్లింపు

**వేద న్యూస్, కాసిపేట:**

బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధిలోని ముత్యంపల్లి సెక్షన్‌లో అడవి పందుల దాడుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు అటవీశాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో మల్కెపల్లి, చింతగూడ గ్రామాల పరిధిలో రైతుల పంటలు దెబ్బతిన్నాయి. రైతుల ఫిర్యాదుల మేరకు అటవీ, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్ర పరిశీలన నిర్వహించి నివేదికలు పంపించారు. వాటి ఆధారంగా 10 మంది రైతులకు మొత్తం రూ.36,137 నష్టపరిహారాన్ని మంజూరు చేసి నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు అటవీ క్షేత్రాధికారి పూర్ణచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడవి జంతువుల నుంచి పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ వంటి చట్టబద్ధ పద్ధతులు అనుసరించాలని సూచించారు. లైవ్ వైర్లు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. భవిష్యత్తులో పంట నష్టం జరిగిన వెంటనే అటవీశాఖకు సమాచారం అందించాలని రైతులను కోరారు. నష్టపరిహారం అందుకున్న రైతులు అటవీశాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# కేయూలో సైక్లింగ్ సెలక్షన్స్ పూర్తి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల వివిధ కళాశాలల విద్యార్థుల కోసం నిర్వహించిన సైక్లింగ్ సెలక్షన్స్ బుధవారం ఉదయం కేయూ క్యాంపస్‌లో విజయవంతంగా పూర్తయ్యాయి. ఉదయం 6 గంటలకు నిర్వహించిన సైక్లింగ్ రేస్‌ను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య ప్రారంభించినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. ఎస్. కుమార్ తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో గెలుపొందిన క్రీడాకారులు మహారాష్ట్రలోని ఎంజీఎం యూనివర్సిటీలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సైక్లింగ్ రోడ్ రేస్‌లో పాల్గొననున్నట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమన్న, వైస్ ప్రెసిడెంట్ రమేష్, ట్రెజరర్ ఎస్. కిరణ్ గౌడ్, వాగ్దేవి పీడీ కిషన్, ఆంజనేయులు, మట్టెడ కుమారస్వామి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# సబ్ కా అడ్డా..

## ‘సారంగం హోటల్’

- మూడు దశాబ్దాల చరిత్ర..
- పట్టణవాసులకు చర్చా వేదిక
- పురప్రముఖులు, రాజకీయులకు ఫేవరెట్ స్పాట్
- హాయిగా టిఫిన్ చేసి ఛాయ్ తాగుతూ.. పిచ్చాపాటి ముచ్చట్లు



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణవాసులు, పుర ప్రముఖులతో పాటు రాజకీయులకు ఉదయాన్నే హాయిగా.. టిఫిన్ చేస్తూ.. ఛాయ్ తాగుతూ.. నలుగురితో ముచ్చటించేందుకు చక్కటి వేదికగా మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ‘సారంగం హోటల్’ నిలుస్తోంది. సుమారు మూడు దశాబ్దాలకు పైనే చరిత్ర కలిగిన ఈ హోటల్ పట్టణ ప్రజలకు ఫేవరెట్ స్పాట్‌గా ఉంటోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 1995లో ఈ హోటల్‌ను ప్రారంభించినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

**అందరి అడ్డా..**

ఉదయాన్నే ఏదైనా పని నిమిత్తం వెళ్లే వాళ్లు, ఉద్యోగులు, పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు హాయిగా సారంగం హోటల్ వద్దకు వచ్చి.. టిఫిన్ చేస్తూ.. పిచ్చాపాటి ముచ్చట్లు పెడుతుండటం ప్రతీ రోజూ చూడొచ్చు. కబుర్లు చెప్పుకోవడమే.. సీరియస్ పొలిటికల్ డిస్కషన్స్ ..వ్యాపార వాణిజ్యానికి సంబంధించిన చర్చలూ ఇక్కడ జరుగుతుంటాయని చెప్పొచ్చు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల తరుణంలో రాజకీయం బాగా హీటెక్కింది. వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఉదయం వేళలోనే టిఫిన్స్ కోసం సారంగం హోటల్ కు వచ్చి.. చర్చలు చేస్తుండటం చూడొచ్చు. ప్రతీ రోజూ ఇక్కడికి రాకపోతే తమకు అసలు పొద్దు పోదని పేర్కొనేవారు పలువురు ఉన్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**చర్చావేదికగా..**

సారంగం హోటల్ అనేది తమకు చర్చ వేదికగా నిలుస్తోందని కొందరు రాజకీయ నాయకులు, జర్నలిస్టులు పేర్కొంటున్నారు. సమాచార సేకరణతో పాటు పలువురు రాజకీయ నేతలను కలుసుకునేందుకు ఇక్కడికి వస్తుంటామని వెల్లడిస్తున్నారు. ఉదయాన్ని ఇడ్లీ, వడ, టిఫిన్స్ తిన్నాక.. చక్కగా ఛాయ్ తాగుతూ.. రకరకాల సానుకూల చర్చలను సారంగం హోటల్ వేదికగా చేస్తుంటామని పలువురు పట్టణవాసులు చెబుతున్నారు. ప్రతీ రోజూ సారంగం హోటల్ వద్దకు వచ్చి వివిధ పార్టీల రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు ప్రజలు, కార్యకర్తలతో ముచ్చట ిస్తుంటారని పలువురు వెల్లడిస్తున్నారు.




### జీవన విధాన మార్పులతోనే

# ఆరోగ్యకరమైన జీవితం

- కేయూ రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం
- ప్రారంభ దశలో గుర్తిస్తే దీర్ఘకాల జీవితం సాధ్యం
- డా. ఏ. నిఖిల్ కుమార్




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని డీన్ స్టూడెంట్ అఫైర్స్, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. జూవాలజీ విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని కేయూ రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం ప్రారం భించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాటా ్లడుతూ.. సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయా మం, మానసిక ప్రశాంతతతో ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని తెలిపారు. ఇలాంటి అవగా హన కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆరోగ్య చైత న్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కీలకో పన్యాసం చేసిన కాకతీయ మెడికల్ కాలేజ్ రేడియేషన్ ఆంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఏ. నిఖిల్ కుమార్ క్యాన్సర్‌పై ఉన్న అపోహలను శాస్త్రీయంగా ఖండించారు. క్యాన్సర్ అంటువ్యాధి కాదని, ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా దీర్ఘకాల జీవితం సాధ్యమని వివరించారు. పొగాకు, మద్యం వినియోగం క్యాన్సర్ ప్రమా దాన్ని పెంచుతాయని హెచ్చరించారు. అలాగే స్క్రీనింగ్ పరీక్షలు లక్షణాలు రాకముందే చేయించుకోవడం అవసరమని సూచించారు. సమన్విత క్యాన్సర్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించగా, 150 మంది విద్యార్థులు పరీక్షలు చేయించుకున్నట్లు యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రొ. మామిడాల ఇస్తారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. ఎడ్ల సుజాత, కోఆర్డినేటర్ డా. రాధిక, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా. వెంకట గోపీనాథ్, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# వోక్స్ పాప్ విద్యార్థులకు వినూత్న కార్యక్రమం



**వేద న్యూస్, జమ్మికుంట:**

- ఎస్బిఐ సందర్శన

జమ్మికుంట పట్టణంలోని వోక్సపోప్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం వినూత్న సందర్శన కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థి ని విద్యార్థులకు అన్ని రంగాలలో అవగాహన కలిగి ఉండాలని, జనరల్ నాలెడ్జ్ తో పాటు సమాజంలో విద్యతో పాటు అన్ని రంగాలలో పూర్తి అవగాహన కల్పించాలని ఉద్దేశంతో.. జమ్మికుంట పట్టణంలోని ఎస్ బిఐ బ్యాంకును 6,7,8 వ తరగతి విద్యార్థులతో సందర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు బ్యాంక్ తో ఉపయోగం ఎలా ఉంటుంది? బ్యాంక్ సేవలు ప్రజలకు ఎలా ఉపయోగ పడతాయో విద్యార్థులకు తెలియజేస్తూ.. బ్యాంక్ అకౌంట్స్ ఎలా తెరవాలి? , బ్యాంకు ద్వారా నగదు బదిలీకరణ , లావాదేవీలు , రుణ సదుపాయాలు గురించి వివరించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ రమణ రెడ్డి , డైరెక్టర్ వెంకటరెడ్డి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, సీపీ

**వేద న్యూస్, చొప్పదండి:**

రేపు కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ శివారులో ఏనుముల రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. గుమ్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సీపీ అధికారులను ఆదేశించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి రూట్ మ్యాప్, విధుల కేటాయింపును మ్యాప్ ద్వారా వివరించారు. భారీ పోలీసు మోహరింపు చేపట్టినట్లు సీపీ తెలిపారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు వచ్చే వాహనాల రద్దీ దృష్ట్యా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించి, ట్రాఫిక్ జామ్ లేకుండా ముందస్తు ప్రణాళికలు అమలు చేయాలని ట్రాఫిక్ విభాగానికి సూచించారు. బారికేడ్లు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, ఫైర్, ఆర్అండ్బీ, ఫారెస్ట్, వైద్య, ఎక్సైజ్, ఐఅండ్పిఆర్ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజేశ్వర్

**వేద న్యూస్, మంచిర్యాల:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు ఈ. రాజేశ్వర్ సూచించారు. బుధవారం క్యాతనపల్లి పురపాలక సంఘ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల ఖర్చుల నిర్వహణపై అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ రమేష్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ.. అభ్యర్థులు నిర్దేశించిన పరిమితి లోపే ఎన్నికల ఖర్చులు చేయాలని, బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే లావాదేవీలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఖాతాలు, ఖర్చుల వివరాలను ఈ నెల 6, 9 తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో పరిశీలనకు హాజరుచేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అభ్యర్థులపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గడపగడప తిరుగుతూ..

- ప్రజల ఆశీస్సులు కోరుతూ..
- జనసేన కౌన్సిలర్ అభ్యర్థి రాకేశ్ విస్తృత ప్రచారం
- 27వ వార్డులో మార్పు సంకేతాలు..
- వినూత్న మేనిఫెస్టోతో..
- బలంగా దూసుకెళ్తున్న యువ నాయకుడు బొమ్మినేని





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 27 వ వార్డులో జనసేన కౌన్సిలర్ అభ్యర్థి నూతన రాజకీయాలకు తెర తీసే విధంగా బలమైన నినాదాలను ప్రజల ముందు ఉంచుతున్నారు. వార్డుకు సంబంధించి వినూత్న మేనిఫెస్టోను ప్రజల దృష్టికి తీసుకెళ్లి.. చర్చ జరిగే విధంగా చేస్తున్నారు. వార్డు పరిధిలో ప్రజలు యువ నాయకత్వం వైపు మొగ్గు చూపేలా.. గాజు గ్లాసు గుర్తుకు ఓటేసేలా కౌన్సిలర్ అభ్యర్థి బొమ్మినేని రాకేశ్ బలమైన ప్రచారం చేస్తున్నారు.

**ప్రజల విశ్వాసం చూరగొని..**

ప్రజల విశ్వాసం చూరగొని..తాము మున్సిపల్ ఎన్నికల్లో జెండా ఎగురవేస్తామని జనసేన కౌన్సిలర్ అభ్యర్థి, యువ నాయకుడు బొమ్మినేని రాకేశ్ వెల్లడిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రచార పర్వంలో వినూత్నంగా తాను ముందుకెళ్తున్నట్టు వెల్లడించారు. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా నవ యువత రాజకీయం ఏ విధంగా ఉండబోతున్నదనేది తెలియాలంటే.. తమకు ఒక్కసారి అవకాశమివ్వాలని ప్రజలను అభ్యర్థిస్తున్నట్టు తెలిపారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటేసి.. యువతకు అవకాశం ఇవ్వాలని కోరారు.

**స్పష్టమైన కార్యాచరణ..**

తనను కౌన్సిలర్‌గా గెలిపిస్తే..24/7 ప్రజలకు అందుబాటులో ఉంటానని, వార్డు పరిధిలో పోచమ్మ గుడి నిర్మాణానికి, అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు పరిధిలో ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తానని, వార్డులో కమిటీ హాల్ నిర్మిస్తానని చెబుతున్నారు. ముఖ్యంగా వార్డును ఏ విధంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనేది తన వద్ద స్పష్టమైన కార్యాచరణ ఉందని, వార్డు ప్రజలందరి సహాయ సహకారాలు, సలహాలు, సూచనలతో వార్డును అన్ని వార్డుల్లోకెల్లా బెస్ట్‌గా, అత్యుత్తమంగా తీర్చిదిద్దుతానని బొమ్మినేని రాకేశ్ వివరిస్తున్నారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటేసి తమను నిండు మనసుతో ఆశీర్వదించాలని ప్రజలను రెండు చేతులు జోడించి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

వేద న్యూస్

గురువారం ఫిబ్రవరి 05, 2026

# గుంతలమయం.. రాత్రి ప్రయాణం అంటే భయం..

## - ఇప్పటికీ మారని బోయినిపల్లి-మర్లపేట-విలాసాగర్ రోడ్డు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

బోయినిపల్లి నుంచి మర్లపేట మీదుగా విలాసాగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిని వాహనదారులకు తలనొప్పిగా మారింది. ఎన్నో నెలలుగా మరమ్మతులకు నోచుకోని ఈ రహదారి ప్రస్తుతం గుంతలమయంగా మారి రోజూ ప్రయాణించే వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రత్యేకించి రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. సరైన వీధిదీపాలు లేకపోవడం, లోతైన గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పలువురు జారిపడి గాయపడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ రహదారి గుండా ప్రతిరోజూ వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఈ మార్గాన్ని విస్తృతంగా వినియోగిస్తారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి రోడ్డే కనిపించకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని వాపోతున్నారు. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు కొద్ది రోజుల్లోనే మళ్లీ దెబ్బతింటున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

# అదనపు విద్యుత్ పోల్స్ కోసం సర్వే



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అదనపు విద్యుత్ పోల్స్ ఏర్పాటుకు సర్వే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కారేపల్లి గ్రామ పంచాయతీ ఎక్స్‌రోడ్డు నుంచి విశ్వనాథపల్లి డీబీ వరకు ఉన్న ప్రధాన రహదారిపై నూతన వీధిలైట్ల ఏర్పాటు నిమిత్తం ఈ సర్వే చేపట్టారు. సర్పంచ్ ఇస్లావత్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి రహదారిని పరిశీలించి, ఎక్కడెక్కడ అదనపు పోల్స్ అవసరమో గుర్తించారు. రాత్రి వేళల్లో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన లైటింగ్ పనులు పూర్తి చేయాలని సర్పంచ్ అధికారులను కోరారు. చాలాకాలంగా వీధిలైట్ల కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు సభ్యులు ముఖర్జీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, విద్యుత్ శాఖ ఫోర్మాన్ లక్ష్మీనారాయణ, గురు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ సీనియర్ నేతల చేరిక

## - 30వ వార్డులో గులాబీ పార్టీ గెలుపుపై లీడర్ల ధీమా

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపాలిటీలోని 30వ వార్డులో కాంగ్రెస్ పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రగిరి శ్రీనివాస్‌తో పాటు బుచ్చయ్య, సర్వర్ పాషా, సజ్జు, లింగరావు, నీలం సురేందర్, విక్కీ సందీప్, ఆనంద్‌లు కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వీరికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. జమ్మికుంట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ గెలిచే పరిస్థితి పూర్తిగా కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల్లో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత నెలకొందని పేర్కొన్నారు 30వ వార్డ్‌లో రవీందర్ రావును గెలిపిస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ చెర్మన్ తక్కలపల్లి రాజేశ్వర్ రావు , జమ్మికుంట పట్టణ 30వ వార్డ్ బిఆర్ఎస్ అభ్యర్థి రవీందర్ రావు, సీనియర్ నాయకులు చొక్కా రంజిత్ సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# జనసేన ఇంటింటి ప్రచారం..

## - 23 వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి వంశీ విస్తృత క్యాంపెయిన్
## - గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని.. ఆదరించాలని ప్రజలకు అభ్యర్థన





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల బరిలో అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కండెం వంశీ కృష్ణ బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటేసి.. తమను ఆదరించాలని కోరారు. నిజమైన మార్పు కోసం తాను జనసేన తరఫున బరిలో నిలిచానని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కౌన్సిలర్‌గా తనను గెలిపిస్తే 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజలకు జవాబుదారీగా ఉంటానని, సుపరిపాలన అందిస్తానని హామీ ఇచ్చారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు.

# అందరినీ ఆత్మీయంగా కలుస్తూ..

## - 24 వ వార్డులో.. ప్రజల విశ్వాసం చూరగొంటూ..
## - ఓట్లు అభ్యర్థిస్తూ.. జనసేన అభ్యర్థి భాగ్య ప్రచారం

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 24 వ వార్డులో గడపగడపకు తిరుగుతూ... ప్రజలందరి విశ్వాసం చూరగొంటూ.. ఆ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పర్లపెల్లి భాగ్య శేఖర్ ముందుకు సాగుతున్నారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరుతున్నారు. సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న తమకు అండగా నిలవాలని ప్రజలను భాగ్య శేఖర్ దంపతులు కోరుతున్నారు. 24వ వార్డు ప్రజలకు 24 గంటలు ఉచిత అంబులెన్స్ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. 24వ వార్డు ప్రజల ఆశీర్వాదంతో కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే సేవా కార్యక్రమాలతో పాటు వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని రాస మల్ల భాగ్య శేఖర్ దంపతులు వెల్లడిస్తున్నారు. ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే నాయకురాలిగా కాకుండా సేవకులుగా తాము చిత్తశుద్ధితో పనిచేస్తామని., ప్రజలకు స్పష్టం చేస్తూ.. వినమ్ర పూర్వకంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

# ప్రపంచం ఎటు పోతోంది?
# అంతర్జాతీయ రాజకీయాల్లో మారుతున్న దిశ

**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు చూస్తే, అంతర్జాతీయ రాజకీయాలు ఒక ప్రమాదకర మలుపు వద్ద నిలిచినట్లుగా కనిపిస్తున్నాయి. ఒకవైపు యుద్ధాలు, మరోవైపు ఆర్థిక అస్థిరత, మరోవైపు వాతావరణ మార్పుల ప్రభావం ఈ మూడు కలిసి ప్రపంచ ప్రజలను అనిశ్చితిలోకి నెట్టుతున్నాయి. ఒకప్పుడు అంతర్జాతీయ సహకారం, దౌత్యం గురించి మాట్లాడిన ప్రపంచం, నేడు శక్తి ప్రదర్శన, ఆధిపత్య పోటీల వైపు మళ్లుతున్నట్లుగా అనిపిస్తోంది.

ప్రాంతీయ ఘర్షణలు అంతర్జాతీయ సంక్షోభాలుగా మారుతున్నాయి. ఒక దేశంలో మొదలైన యుద్ధం, క్రమంగా అనేక దేశాలను ప్రభావితం చేస్తోంది. ఆయుధాల సరఫరా, రాజకీయ మద్దతు, ఆర్థిక ఆంక్షలు ఇవి యుద్ధాలను తగ్గించడానికంటే, మరింత పెంచుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. శాంతి చర్చలు పక్కకు నెట్టబడి, యుద్ధ భాషే ప్రధాన సంభాషణగా మారటం మానవ భవిష్యత్తుకు శుభసూచకం కాదు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రమైన ఒత్తిడిలో ఉంది. ధరల పెరుగుదల, ఇంధన సంక్షోభం, సరఫరా గొలుసుల అంతరాయం ఇవన్నీ కలిసి సామాన్య ప్రజల జీవితాన్ని భారంగా మారుస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు తమ సమస్యలను తట్టుకోగలుగుతున్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సమానత్వం లేదన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి.

వాతావరణ మార్పులు ఇక భవిష్యత్తు సమస్యగా మిగలలేదు. అవి ప్రస్తుతం జరుగుతున్న విపత్తులుగా మారాయి. వరదలు, కరువులు, తుఫానులు, ఉష్ణోగ్రతల పెరుగుదల ఇవన్నీ ప్రపంచంలోని పేద దేశాలను ఎక్కువగా దెబ్బతీస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలు సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఆచరణలో తీసుకుంటున్న చర్యలు మాత్రం తక్కువగానే ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతర్జాతీయ సంస్థల పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపాల్సిన సంస్థలు, పెద్ద దేశాల ప్రయోజనాల మధ్య చిక్కుకుపోయాయన్న అభిప్రాయం బలపడుతోంది. నిర్ణయాలు ఆలస్యంగా రావడం, లేదా ప్రభావవంతంగా అమలుకాకపోవడం వల్ల ప్రపంచ ప్రజల్లో నమ్మకం తగ్గుతోంది. ఇది అంతర్జాతీయ వ్యవస్థ బలహీనతను బయటపెడుతోంది.

నేటి ప్రపంచానికి అవసరమైనది కొత్త ఆయుధాలు కాదు, కొత్త ఆలోచనలు. శక్తి రాజకీయాల స్థానంలో మానవ కేంద్రిత దృక్పథం రావాల్సిన అవసరం ఉంది. యుద్ధాల వల్ల గెలిచేది ఎవరూ లేరు, ఓడిపోయేది మాత్రం మానవత్వమే అన్న సత్యాన్ని ప్రపంచ నాయకులు గుర్తించాల్సిన సమయం ఇది. శాంతి, సహకారం, పరస్పర గౌరవం ఇవే ప్రపంచాన్ని నిలబెట్టే మూలస్తంభాలు.

ఈ పరిస్థితుల్లో ప్రపంచ ప్రజల పాత్ర కూడా కీలకం. ప్రశ్నించే స్వరం, శాంతి కోసం డిమాండ్ చేసే చైతన్యం పెరగాలి. ప్రభుత్వాల నిర్ణయాలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా మారినప్పుడే ప్రపంచం సురక్షిత దిశగా ప్రయాణించగలదు. యుద్ధాలకంటే శాంతి, విభజనలకంటే ఐక్యత అవసరమన్న సందేశాన్ని అంతర్జాతీయ ఎడిటోరియల్‌గా ఈ కాలం స్పష్టంగా వినిపిస్తోంది.

ప్రపంచం ఎటు పోతోందన్న ప్రశ్నకు సమాధానం ఇంకా మన చేతుల్లోనే ఉంది. శక్తి పోటీలను ఎంచుకుంటామా? లేక శాంతి మార్గాన్ని ఎంచుకుంటామా? ఈ నిర్ణయమే రాబోయే తరాల భవిష్యత్తును నిర్ణయించనుంది.

# జనం ఆశీస్సులు కోరుతూ..

## - 19 వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి సురేశ్ ప్రచారం
## - కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు అభ్యర్థన



**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. బుధవారం ఇంటింటికీ తిరుగుతూ 19 వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి సురేశ్ రాయబారపు ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటేసి తమకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని వెల్లడించారు. కేంద్ర నిధులతో జమ్మికుంట పట్టణ అభివృద్ధికి ఇప్పటికే స్థానిక ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి చేశారని వివరించారు. తమకు ఒక్క అవకాశం ఇవ్వాలని 19 వ వార్డు ప్రజలను బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి సురేశ్ కోరారు.

# రూ. 10 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యాశాఖ జూనియర్ అసిస్టెంట్

**వేద న్యూస్ హైదరాబాద్ :** ఏసీబీ వలలో మరో ప్రభుత్వ ఉద్యోగి చిక్కారు. నగరంలోని బండ్లగూడ డిప్యూటీ విద్యాశాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న శివప్రసాద్ బుధవారం ఓ స్కూల్ యాజమాన్యం నుంచి రూ. 10 వేలు తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. పదవ తరగ తి పరీక్ష కేంద్రం నుంచి తమ పాఠశాలను తొలగించవద్దని బాధితుడు కోరగా అందుకు శాఖాధికారులు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జూనియర్ అసిస్టెంట్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వివరించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073